
క.నం 74787

# నాకొద్దు డ్రైవింగ్



అప్పుడే కాఫీలయ్యాయి. క్రితం రోజు మెయిల్లో వచ్చిన మా తమ్ముడు, మావారు కబుర్లు చెప్పుకుంటూ ముందు వరండాలో కూర్చున్నారు.


ఉదయం ఏడుగంటలవేళ. చల్లటి గాలితో వాతావరణం ప్రశాంతంగా ఉంది. కొత్తగా కొన్న ఫియట్ కారు ఇంటిముందు నిగ నిగ లాడుతోంది. అంతకు ముందున్న పాత స్టాండర్డు స్థానంలో కొత్త ఫియట్ వచ్చి వారం రోజులైంది.

అప్పుడే పని పూర్తిచేసుకొని వచ్చిన నేను కారునుగురించిన బావ, మరదుల సంభాషణను వింటూ వరండా తిన్నెమీద కూర్చున్నాను. నన్నుచూచి మా తమ్ముడంటున్నాడు; "అక్కకు డ్రైవింగ్ నేర్పేయ్ బావా! నీ కిబ్బందిలేకుండా ఎక్కడకు కావాలన్నా తనే వెళుతుంది".

"ఆహా! రద్దీగా ఉన్న రోడ్డుమీద నడవడానికే భయపడే మీ అక్కేనా కారు డ్రైవ్ చేసేది" అన్నారు నా ధైర్యసాహసాల నెరిగిన మావారు.

మావాడు నావైపు తిరిగి "ఏం అక్కా! నీకు తీరిక యెక్కువేకదా! చక్కగా డ్రైవింగ్ నేర్చుకో కూడదూ? బావకు శ్రమ తప్పించిన దానవూ అవుతావు, నీవూ ఎక్కడికెళ్ళాలన్నా ఒకరితో ప్రమేయం లేకుండా వెళ్ళనూవచ్చు" అన్నాడు.

కాని నా ధైర్యంమీద నాకే నమ్మకంలేదు. సహజంగానే ఏ విషయంలోనైనా ధైర్యం తక్కువ నాకు. అలాంటిదానికి ఈ జన్మలో డ్రైవింగ్



లాంటివి వస్తాయనే నమ్మకం నా కెప్పుడూ లేదు. అయినా, ఆ క్షణాన మాత్రం వీళ్ళందరికీ పెద్ద తెలివి తేటలు, ధైర్యసాహసాలు మొదటినుంచీ ఉండేనా యేమిటి, డ్రైవర్లయ్యారు; ధైర్యంచేసి నేర్చుకుందాం; డ్రైవింగ్ ఎందుకురాదో అనే ఒక అభిలాష కలిగింది. దాంతో మావాడితో 'మీా ఎవ నేర్పేట్టయితే తప్పకుండా నేర్చుకుంటాను' అన్నాను, మనసులో కారు డ్రైవ్ చేసే ఆడవాళ్ళను గుర్తు చేసుకుంటూ.


'నీకా గుండె ధైర్యం ఉండాలే గాని నేర్పడానికి నాకేమీ అభ్యంతరంలేదు' అన్నారు మావారు.

ఇంతలో మావాడు 'ఇదుగో అక్కా! నీవు డ్రైవింగ్ నేర్చుకొని కారులో నన్ను తీసుకొని మనింటివద్ద నుంచి పేరిస్ కార్నర్‌వరకు నీవే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళివస్తే నీకు వెయ్యి రూపాయలిస్తాను; ఇదే పందెం' అన్నాడు. వాడూ మొదటి నుంచి నా ధైర్య సాహసాలు బాగా తెలిసినవాడు గనుక, నా పిరికితనం మీద అంత ధైర్యంగా పందెం పెట్టాడే అనే దుగ్ధతో నాకు డ్రైవింగ్ ఎందుకు రాదో చూదామనే ఒక పట్టుదల కలిగింది. అది ధనాపేక్ష కంటె ముఖ్యంగా ధైర్యంగా డ్రైవింగ్ నేర్చుకొని పందెం నెగ్గాలనే పట్టు. 'సరే రేపటినుంచే నాకు డ్రైవింగ్ నేర్పండి' అని మా వారితో అన్నాను 'ఓ! అలాగే రేపుదయమే లేచి బీచ్ రోడ్డుకువెళ్ళి అక్కడ మొదలు పెడదాం'మని ముహూర్తం నిశ్చయించారాయన.

'అయితే నా వేయి రూపాయలు ఖాళీ అన్నమాట. ఎందుకైనా మంచిది ఇప్పటినుంచే జాగ్రత్త పడతాను! రేపే హుండీ ఒకటి పెట్టి రోజూ కొంత దాన్లో వేస్తూంటాను. మీరు గెలిచాక చదివించుకోవాలిగా మరి' అంటూ నవ్వాడు మా తమ్ముడు. ఆ రాత్రి మెయిల్లో వాడుపనులున్నాయంటూ వెళ్ళిపోయాడు. మర్నాడు తెల్లవారు జామున నాలుగున్నరకే లేచి, స్నానం వగైరా నా పనులు ముగించుకొని, మా వారిని నిద్ర లేపాను. బీచ్ రోడ్డుకు వెడదాం లెండంటూ.

'ఏమిటి నిజంగా డ్రైవింగ్ నేర్పమంటావా ?' అన్నారు మా వారు.

'ఇంకా సందేహమా ? లేవండి, లేవం'డంటూ తొందర పెట్టాను. ఇక తప్ప దనుకుంటూ లేచి వారి పనులు ముగించుకొని 'సరే పద' అన్నారు,



ఆరున్నర తరువాతగాని పక్కమీద నుంచి లేవని శ్రీవారు పాపం. ఇద్దరం బయలుదేరి కారు తీసుకొని బీచ్ రోడ్డుకు వెళ్ళాము. వెడుతూ దారిలో కారు ఎలా నడిపేదీ, యాక్సిలరేటర్ అంటే ఏదో, క్లచ్ అనగా యేమిటో, గియర్సు, బ్రేక్సు వగైరా ఎప్పుడు ఎలా వుపయోగించాలో జాగ్రత్తగా వివరించి, స్టీరింగ్ నా చేతి కిచ్చారు మా వారు. అన్నీ శ్రద్ధగా గమనించి, వారు పక్కన ఉండి నేర్పుతూండగా స్టీరింగ్ ముందు కూర్చొని కాళ్ళు క్లచ్ మీద, యాక్సిలరేటర్ మీద పెట్టి స్టీరింగ్ తిప్పటం మొదలు పెట్టాను. ఇక చూడండి. ఆ వెడల్పాటి రోడ్డుమీద పాములా మెలికలు తిరుగుతూ అష్ట వంకర్లుగా నడవడం మొదలు పెట్టింది కారు.

'అలా కాదు. తిన్నగా పోనీయాలి' అంటారు మా వారు.

'నే నేం చేయను. ఇటు తిప్పుతూంటే అటు పోతుందేమిటి' అంటాను నేను.

అలా ప్రారంభమైంది నా డ్రైవింగ్ మొదటి పాఠం. మొత్తానికి ఎలాగయితే నేం ఒక గంటసేపు మా ఇద్దరి కృషితో కొంతవరకు దారికి వచ్చింది మొదటి పాఠం.

అలాగే పట్టుదలతో ప్రతిరోజూ తెల్లవారు జామున శ్రీవారిని మేల్కొలిపి, నిద్రబద్ధకం వదిలించి బీచ్ రోడ్డున తీసికొని వెళ్ళి డ్రైవింగ్ ప్రాక్టీస్ చేస్తూండేదాన్ని. రోజు రోజుకు అభివృద్ధి ఉండటంవల్ల,

ఎస్. సుగుణాదేవి

● ఇద్దరు స్నేహితులు తిరపతి కొండమీంచి కార్లో దిగి వస్తున్నారు. పాములా మెలికలు తిరిగిన రోడ్డుమీద మలుపువచ్చినప్పుడల్లా వెనక సీట్లో కూచున్నవాడు హడిలి పోతున్నాడు. కారు నడుపుతున్న వాడితో 'కాస్త నెమ్మదిగా పోనియ్యవోయ్, భయమేస్తోంది' అన్నాడు.

'నేను చేసినట్టు చెయ్, భయం పోతుంది' అన్నాడు కారు నడిపేవాడు.

'ఏమిటది?'

'మలుపొచ్చినప్పుడల్లా కళ్ళు గట్టిగా మూసుకో.'

భయంతీరి, ఫరవాలేదు నేర్చుకోగలననే సంతృప్తి అయితే కలిగింది గాని మధ్యలో నే నేర్పేప్పుడు మాత్రం మా గురువుగారి విసుగు చీకాకు చూడాలి. 'నీకెక్కడొస్తుందీ డ్రైవింగూ? హాయిగా నిద్రపోయే వాడిని నా నిద్ర అనవసరంగా పాడు చేస్తున్నావే గానీ నీ పీపీ జన్మలో నేర్చుకోలేవు' అని విసుక్కునే వారు ఏమైనా పొరపాట్లు జరిగినప్పుడు. అలా అన్నప్పుడల్లా ఉడుకుబోతనంతో మరింత పట్టుదల శ్రద్ధ చూపించే దాన్ని.

మధ్యమధ్య 'నన్నెందుకు బాధ పెడతావు. డ్రైవర్ని పంపిస్తాను గాని నేర్చుకో. నా నిద్ర చెడగొట్టి నన్ను వేధించకు' అని కోపగించుకుంటూండేవారు. 'నాన్సెన్స్. డ్రైవరు పక్కన కూర్చొనా, నేను నేర్చుకొనేది. వీల్లేదు. ప్రొద్దుట నిద్ర చెడుతుందనుకుంటే పోనీ సాయంత్రం వేళల్లోనైనా సరే, మీరే నేర్పి తీరాలి. నేర్చుకొని నేను పందెం గెలవాలి', అంటూ మొండికేసే దాన్ని.

ఎలా అయితేనేం, నేను అప్పుడప్పుడూ బెదిరిస్తూనే నేను డ్రైవింగ్ నేర్చుకోవాలనే కుతూహలం వారికి కూడా కొంత ఉండటంవల్లనైతేనేం నా పోరు పడలేకయితేనేం, చివరకు ఓపిక తెచ్చుకొని నేర్పేవారు పాపం.

అలా విశాలమైన బీచ్ రోడ్డున ప్రశాంతమైన ఉదయంవేళ సముద్రపు గాలిలో స్టీరింగ్ తిప్పుతూ కారు డ్రైవింగ్ నేర్చుకుంటూంటే, అప్పుడే డ్రైవింగ్ అంతా వచ్చేసినట్టూ హాయిగా గాలిలో తేలిపోతున్నట్టూ విమానంలో ఎగిరిపోతున్నట్టు అనిపించేది ఆ వేళప్పుడు ఆ ప్రదేశంలో నాలాగే డ్రైవింగ్ నేర్చుకోవడానికి కారుకు 'ఎల్' బోర్డులు తగిలించుకొని వచ్చే చాలామంది ఆడవాళ్ళను, మగవాళ్ళను చూస్తూండేదాన్ని. కొంతమంది కొద్దికొద్ది దెబ్బలు తిన్న కార్లతో తిరిగిపోతూంటే భగవంతుడి దయవల్ల నాకలాంటి పొరపాట్లు జరగనందుకు సంతోషపడేదాన్ని.



కొత్తగా నేర్చుకొనే మగవాళ్ళను చూస్తుంటే వాళ్ళకంటె నేనే బాగా డ్రైవ్ చేస్తున్నానని గర్వపడేదాన్ని. అలాంటప్పుడు మరింత జాగ్రత్త చూపెట్టేదాన్ని.

కాని అలా ప్రాక్టీస్ చేసేటప్పుడు ఎదురుగా కార్లు, బండ్లు సైకిళ్లు వగైరాలు భూతాల్లాంటి బస్సులు, లారీలు వస్తున్నప్పుడు మాత్రం ఇంకేముంది—అవి అమాంతంగా వచ్చి కారు మీద పడిపోయాయనే భ్రమ కలిగేది. ఆ భయంతో అలాగే స్టీరింగ్ వదిలేయాలనిపించేది. కాని అవి దాటిపోగానే 'హమ్మయ్య' అనుకొనేదాన్ని. మధ్యమధ్య రోడ్డుపక్క కుర్రవాళ్ళు 'పొంబళ కారు ఓడర పార్' అనుకుంటూంటే విని నవ్వుకుంటూ డ్రైవింగ్ నేర్చుకోడం చాలా సరదాగానే ఉండేది. అప్పుడప్పుడు గియర్సు మార్చేప్పుడు తికమక పడుతూంటేనూ, ఆపమన్నచోట బ్రేకు సరిగా వేయలేకపోయినప్పుడూ మాత్రం మా గురువుగారు 'ఇక నా కారు ఖాళీనే, నీ డ్రైవింగ్‌తో' అనేవారు. అప్పుడు మాత్రం నా మనసు కొట్టుకునేది. నిజంగా అంత ఖరీదు పెట్టికొన్న ఇంత చక్కని కారూ పాడైపోతుందేమో, ఇక రేపటినుండి మాత్రం డ్రైవింగ్ వద్దు అనిపించేది. కాని మర్నాడు తెల్లవారుతూండగా అన్నీ మర్చిపోయి మళ్ళీ శ్రీవారిని లేపేదాన్ని. ఒక్కోసారి నేర్పుతూ వారు బాగా విసుక్కున్నప్పుడు ఛీ! ఏమయినాగానీ ఇక కారు ముట్టుకోగూడదు అనిపించి అప్పుడే స్టీరింగు వదిలేసి 'ఫోండి నాకు డ్రైవింగూ వద్దు ఏమీ వద్దు నేను నేర్చుకోను, మీరు నేర్పనూవద్దులె'మ్మనే దాన్ని. ఏమిటో మధ్యలో వారిని ఉద్ధరిస్తు

న్నట్టు. మళ్ళీ మంచి మాటలతో చెప్పించుకొని బయటపడేవాళ్ళం. ఏం విసుక్కున్నా వారుచాలా నేర్పుతోను ఓర్పుతోనూ నేర్పేవారు.

ఇలా పదిహేనురోజుల ప్రాక్టీసుతో బాగా రష్‌గావుండే పేరిస్ కార్నర్, మౌంట్‌రోడ్డు లాంటిచోట్ల మాత్రం బీచ్‌రోడ్డున డ్రైవ్ చేసినట్టు చేయలేకపోయినామిగతా రోడ్లమీద బాగానే డ్రైవ్ చేయగలిగేదాన్ని. ఇక చివరిరోజు తిరిగి వచ్చేప్పుడు మా వారు 'ఇక నీకి డ్రైవింగ్ చాలే. రేపటి నుండి మాత్రం దయ చేసి నా నిద్ర చెడగొట్టకు. నేనిక తెల్లవారు జామున లేచి రాలేను. కావాలంటే మనింటివద్ద రోడ్లు రష్‌గా ఉండవు గాబట్టి, ఇక నీవే ప్రాక్టీస్ చేసుకో' అంటూ పేచీ పెట్టారు.

దానికి తగినట్లుగానే ఆ రోజు అనుకోని సంఘటన ఒకటి జరిగింది. మేము ఉండేది కోడంబాకంలో అవటంవల్ల ప్రతిరోజు డ్రైవింగ్ నేర్చుకోవడానికి వెళ్ళేప్పుడూ, వచ్చేప్పుడూ చిన్నగేటు దాటి వెళ్ళవలసి వచ్చేది. లెవెల్ క్రాసింగ్ దగ్గరకు రాగానే స్టీరింగ్ మా వారికిచ్చేదాన్ని డ్రైవింగ్‌సీటు మార్చుకునేవాళ్ళం. ఆరోజు కూడా ఎప్పటిలాగానే మేము అక్కడకు చేరుకునేప్పటికి గేటు వేసివుండటంవల్ల కారు ఆపి, ఇక స్టీరింగ్ మావారిని తీసుకోమన్నాను. కాని వారు ఇక మిగిలిన ఆ కొంచెం భయంకూడా తీర్చి గేటు దాటించాలనే ఉద్దేశ్యంతో "ఫరవా లేదు, ఏమీ భయపడకు" అన్నారు. ఎంత చెప్పినా ఆయన వినలేదు.

మేమిద్దరం అలా వాదించుకుంటూండగానే గేటు తెరిచారు. మా ముందున్న కార్లన్నీ వెళ్లిపోతున్నాయి. ఎలాగో ధైర్యంచేసి కారు స్టార్ట్ చేశాను. సరిగ్గా గేటు దాటబోయే సమయానికి ఒక గేటుమూసి రెండో గేటు కూడా మూయబోతున్నారు. త్వరగా గేటుదాటాలనే తొందరలో ఆదేమాదిరి తొందరతో ఎదురుగా వచ్చే సైకిలును గమనించలేదు నేను. ఇంతలో ఆదుర్దాతో మావారు 'బ్రేకు, బ్రేకు' అంటూ సడెన్‌గా బ్రేక్ నొక్కి స్టీరింగ్ పట్టుకున్నారు కంగారుగా నేను పక్కకు తిరిగి చూస్తే ఏముంది, మా కారుతో ఢీకొనడంవల్ల ముందు చక్రం అష్టవంకర్లుపోయిన సైకిలును లేవదీసుకుంటూ సైకిలుమీదనుంచి పడటంవల్ల దెబ్బ తగిలిన చేతిని సవరించుకుంటూ ఒకతను కనిపించాడు. ఇదంతా క్షణంలో జరిగిపోయింది. నాకు ఒకటే కంగారుతో మతిపోయినట్లయింది. గేటుమూసే హడావుడిలో ఎలాగో కోడంబాకంవైపు మేము, మాంబళంవైపు అతనూ గేటు దాటాము. ఇదంతా చూచిన్న పోలీసు కానిస్టేబుల్ కేసు వ్రాసుకోవాలంటూ తయారయ్యాడు.


తీరా దగ్గరకు వచ్చాక అతను మమ్మల్ని బాగా ఎరిగిన వాడవటంవల్ల 'ఎల్' బోర్డును చూచి నవ్వుతూ

తేను వ్రాయకుండా సైకిలతనికి మాత్రం రిపేర్కని అతను కోరిన యిరవై రూపాయలు మా చేత ఇప్పించి పంపించాడు. సైకిలతను కూడా మందివా డవడంతో ఇరవై రూపాయలతో మమ్మల్ని వదలిపెట్టి వెళ్ళిపోయాడు. పాపం దెబ్బతిన్న కొత్త సైకిల్ని అతన్ని చూచి ఒకపక్క జాలివేస్తున్నా సైకిమాత్రం "యల్" బోర్డులు చూచైనా జాగ్రత్త పడక్కర్లా" అని నా తప్పేమీ లేదన్నట్లు దబాయించబోయాను. కాని మావారు "చాల్లే! ఇక అపు. చేసిన ఘనకార్యం చాలక ఇంకా దబాయింపు కూడాను పైగా" అన్నారు కోపంగా.

"ఇందులో నా తప్పేమీ లేదు. నేను ముందే చెప్పాను గదా! విన్నారా మీరు" అన్నాను నేను. వారింకేమీ అనలేక ఊరుకున్నారు. ఈ గొడవలతో ఇంటికి చేరుకునేప్పటికి చాలా పొద్దెక్కింది అంతే, ఇక ఆ రోజుతో మళ్ళీ కారుజోలికి పోలేదు.

ఆ తరువాత రెండుమూడు నెలలకు మా తమ్ముడు వచ్చాడు. వేసవి సెలవు లవటంవల్ల మా చెల్లెలు, మా అక్క కూతురు కూడా అప్పుడు మాయింటివద్దే ఉన్నారు. అంతలో తిరుపతిలో జరిగే మా బంధువుల అమ్మాయి పెండ్లికి ఆహ్వానం వచ్చింది. స్కూలుఫైనలు పరీక్షల్లో ప్యాసైతే తిరుపతి వస్తానని వెంకటేశ్వర స్వామితో చెప్పుకుందట మా అక్క కూతురు. సరే ప్యాసై. పి.యు.సి. పరీక్షలు కూడా వ్రాసింది గాని ఆ మ్రొక్కుమాత్రం అలాగే ఉంది. రిజల్ట్సు రాకముందే ఆ మొక్కుబడి చెల్లించుకోవాలని ఉంది ఆ పిల్లకు. ఎలాగూ తిరుపతిపెండ్లికి వెళుతున్నాం గదా అన్నీ కలసి వస్తాయి వేసవి కాలం తిరుపతి కొండలమీద అందరం నాలుగురోజులు కులాసాగా గడపవచ్చని అందరం కలసి బయలుదేరి కారు తీసుకొని తిరుపతి వెళ్ళాము.

అక్కడ పెండ్లి చూచుకొని మా అక్కగారమ్మాయి మ్రొక్కుబడి స్వామికి చెల్లించి సరదాగా నాలుగు రోజులు కొండమీద గడిపాము. అయిదవరోజు తెల్లవారు జామున లేచి బయలుదేరి తిరుగు ప్రయాణమైనాము. కొండ దిగి తిరుపతి దాటి కొంతదూరం వచ్చాక డాష్‌బోర్డు క్రింది భాగంలో కొన్ని కాగితాలమధ్య నుంచి రెండు "ఎల్" బోర్డుల అట్టముక్కలుతొంగిచూడటం ముందుసీటులో కూర్చుని ఉన్న మా తమ్ముడు గమనించి వాటిని బైటకు లాగాడు. "ఏమిటీబోర్డులు" అన్నాడు. "మీ అక్కతో నీవు డ్రైవింగ్ విషయంలో పందెం వేశావుగా, అప్పుడు కొన్నాళ్ళు డ్రైవింగ్ నేర్చుకుందిలే మీ అక్క" అన్నారు మా వారు. "నిజంగానా ?" అన్నాడు. "నిజమే" నన్నారు, శ్రీవారు. కాని ఎందుకో మా వాడికి మాత్రం నేను కారు డ్రైవింగ్ నేర్చుకున్నానంటే నమ్మకం కలగలేదు. నమ్మక నా వైపు తిరిగాడు. అవునన్నాను.



అయినా నమ్మలేదు. సందేహం తీరక మళ్ళా పందెం మొదలు పెట్టాడు.

'సరే చూస్తాను అక్కా! నీవు డ్రైవింగ్ నేర్చుకున్నమాట నిజమయితే ఈ రోడ్డుమీద నేను చెప్పిన చోటునుండి ఒక్క ఫర్లాంగు మాత్రం నీవు డ్రైవ్ చేయి. నేను నమ్ముతాను' అన్నాడు.

'ఏమి పందెం' అన్నాను నేను నవ్వుతూ.

'యాభై రూపాయలిస్తాను' అన్నాడు నేను నేర్చుకోలేదనే నిశ్చయంతో పాపం. మావారు వింటూ నవ్వుతూ 'ఓ డి పో తా వో య్' అన్నారు. అయినా నమ్మలేదు మావాడు.

'ఆల్ రైట్. అతని ఇష్టం వచ్చిన చోట ఆపండి' అన్నాను నేను ధైర్యంగా. 'సరే' అని అతను ఆపమని చెప్పినచోట కారు ఆపారు మావారు. వెనుకసీటునుంచి దిగివచ్చి డ్రైవింగ్ సీటులో కూర్చున్నాను నేను. పదిహేనురోజులు పట్టుదలతో ప్రాక్టీస్ చేసిఉన్నానేమో డ్రైవ్ చేస్తూంటే ఫర్లాంగుకాదు, నాలుగు ఫర్లాంగులు వెళ్ళినా నాకు ఆపాలని లేదు. మావాడు ఆశ్చర్యంతో అప్పటికిగాని నమ్మలేదు. 'ఓడిపోయాను' అని వప్పుకుని, డ్రైవింగ్ జోకులు, అవీ ఇవీ చెబుతూ ఎంత దూరం వెళ్లిందికూడా మర్చిపోయాడు.

అలా ఇంచుమించు నాలుగైదు మైళ్ళు వెళ్ళడంతో 'నగరి' దగ్గరకు వచ్చాము.

'ఇక ఊరిలో కొచ్చాం ఆపేస్తా' నంటాను నేను. 'వద్దు అలా కాదు. హోటల్ కు వెళ్ళి కాఫీ తీసుకుందాము. అందాకా పోనివ్వ' మన్నారు, కృష్ణార్జునులలాంటి ఆబావ బావమరుదులిద్దరునూ. సాధారణంగా మేము ఎప్పుడు తిరుపతి వెళ్ళినా దారిలో 'నగరి'లో ఉన్న వాటిల్లో

కాస్త శుభ్రంగాను రుచిగా ఉండే ఒక అయ్యర్ హోటల్లో సమయాన్ని బట్టి కాఫీ టిఫిన్ వగైరాలు అవసరానికి తీసుకుంటుంటాము. ఆ హోటల్ వరకుపోయి ఆపుకుందామని మా వాళ్ళు, బస్సులు, జనం రద్దీ చూచి "ఆపేస్తా"నని నేను; అంటూ పోతూనే ఉండగా అక్కడి జనం వింతగా మా కారువైపు చూడటం గమనించాము మేము. జన సమ్మర్దం వల్ల కారు నెమ్మదిగా పోనిస్తున్నాను. ఇంతలో "చూడరా వెంకయ్యా; నువ్వూ వున్నావు నేనూ ఉన్నాను, ఎందుకూ మనం? ఆడకూతురు కారు తోలుతున్నది. చూడరా ఏం జోరుగా తోలుతోందో చూడు" అనే మాటలు వినిపించాయి. అది విన్న మా వాళ్ళు మరింత ఉత్సాహంతో "ఊ పోనీయ్, పోనీయ్" అంటూ నన్ను హెచ్చరిస్తున్నారు. కాని నాకు నవ్వాగడంలేదు. ఇంతలో హోటల్ దగ్గరకు చేరుకోవడంతో ఇక కారు ఆపాను. అందరం హోటల్లోకి వెళ్ళి అయ్యరిచ్చిన వేడి వేడి కాఫీ; టిఫిన్ తినుకొని అలసట తీర్చుకొని బైటకు వచ్చాం. ఇక అక్కడి నుంచే మా వారి డ్రైవింగ్‌తో సరదాగా కబుర్లు, నవ్వులతో ఇంటికి చేరుకున్నాము

"మొత్తానికి కష్టపడి ధైర్యంగా డ్రైవింగ్ నేర్చుకొని ఇప్పటికి ఈ చిన్న పందెం గెలిచావుగాని అసలు పెద్ద పదం ఉందిగా, అది గెలవాలి" అంటూ మా తమ్ముడు నేను అప్పటికి గెలిచిన యాభై రూపాయలు ఇచ్చాడు; పందెం పేరుతోనైనా నేను ధైర్యం చేసి డ్రైవింగ్ నేర్చుకున్నందుకు సంతోషిస్తూ.

ఆ రాత్రి మెయిల్‌కు అతను బెజవాడ బయలుదేరి వెళుతూ "నేను మళ్ళీ వచ్చేప్పటికి వెయ్యిరూపాయల పదెం గెలవటానికి సిద్ధంగా ఉండాలి అక్కా! వస్తాను మరి!" అంటూ వెళ్ళాడు.

నా కారు డ్రైవింగ్ అలా మా తమ్ముడి వేయి రూపాయల పందెంతో ప్రారంభమై యాభై రూపాయలు గెలవటంతో ఆగిపోయివుంది.

□□□

